

# సాహిత్య పాకశాల

'గణితశ్రీ'

ఈ నెలలో చెప్పుకోదగ్గ సంఘటన "సాహిత్య పాకశాల" ప్రారంభం పలువురు రచయితలు - సాహిత్య నలులూ, సాహిత్య భీములూ - ప్రస్తుతం "పాకశాల"లో పనిచేస్తున్నారు "పాకశాల" ఇరవైనాలుగ్గంటలూ తెరిచే వుంటుంది మనకు కావలసిన సాహిత్య దినుసు గంటల్లో అక్కడ వండేసి అందించడం జరుగుతుంది

ఉదాహరణకు మనకు అర్జంటుగా ఒక నవల ప్రచురణకు కావాలనుకోండి వెంటనే కార్యదర్శిగారిని కలుసుకోవాలి ఆయన మనకోసం ఇద్దరు నవలా రచయితలను కేటాయిస్తారు వాళ్ళు కొన్ని ప్రశ్నలు వేస్తారు "నవల ఎన్ని పేజీలుండాలి? సైజు ఏమిటి? ఏ ప్రెస్సు వాడతారు?"

ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాక ఇతివృత్తంగురించి చర్చలు జరుగుతాయి "కథ సుఖాంతంగా వుండాలా? ట్రాజెడీకావాలా? బోయ్స్ మీటింగ్ గర్ల్సా, గర్ల్స్ మీటింగ్ బోయ్సా? శరత్‌బాబు టెక్నిక్ పనికొస్తుందా? శృంగారం ఏమోతాదులో వుండాలి? వర్ణనలు ప్రవేశ పెట్టవచ్చునా? అనగా కావలింతలూ ముద్దులదాకా పోవచ్చా?" అని అడిగి తృప్తికరంగా జవాబులు రాబట్టుకొన్నాక, రచయితలు రచన మొదలుపెడతారు. మొదటిసగం ఒకరూ రెండోసగం ఇంకొకరూ రాసేస్తారు. అయితే శిల్పం చెడదు భాష పట్టివ్వదు అంతా ఒక చేతిమీదుగా అయినట్లుగానే వుంటుంది

లేదూ మనకు రేడియోటాకుకు స్క్రిప్టు

కావాలనుకోండి. "పాకశాలా"ధిపతులు ఒకాయన్ని మనకు అప్పజెబుతారు" "ఎన్ని నిమిషాల టాకు సార్? అంకెలు వుండవచ్చా లేకపోతే జనరల్‌గా రాసేయమంటారా?" అంటాడు ఆయన.

కవిత్వ విభాగంలో మొన్న నొక గమ్మత్తు జరిగింది. ఒకాయన వొచ్చి మూడు పేజీల వచన కవిత అర్జంటుగా కావాలన్నాడు. ఇద్దరు కవులు గదిలో కూర్చొని నేతపని చేస్తున్నారు. ఇంతలో ఆయన మనస్సు మార్చుకుని "అయ్యా వచనకవిత ఇప్పుడువొద్దు. మాత్రాచ్ఛందస్సులో రాయించండి" అని కార్యదర్శి దగ్గరకువెళ్ళి ప్రాధేయపడ్డాడు. ఆయన వెంటనే వచన కవుల గదికి ఫోనుచేసి "మీ ఎస్సైన్‌మెంట్ కాన్సిల్ అయింది" అని చెప్పి మాత్రాచ్ఛంద కవుల గదికి ఫోనుచేసి "త్వరగా వందేస్రు"మని వివరాలు అందించాడు.

'సాహిత్య పాకశాల'లో ప్రతి రచనకూ ఒకనికరమైన రేటువుంది. ఇన్ని పేజీల నవలకు ఇంత, ఇన్నిలైన్ల వచన కవితకు ఇంత, అయిదు కందపద్యాలకు ఇంత... ఇలా టారిఫ్‌వుంది. దాని ప్రకారం బిల్లు తయారుచేయబడుతుంది.

ఒక్కొక్కప్పుడు "పాకశాల" ప్రత్యేకమైన ఆర్డర్లుకూడా స్వీకరించి ఐనుసు తయారు చేయిస్తుంది. "అయ్యా ఫలానా పరిషత్తువారు మొదటిబహుమతి ఇచ్చేటటువంటి నాటకం కావాలి" అనో లేకపోతే "ఫలానా అకాడమీవారి తొలి బహుమతి పొందే నవల కావాలి" అనో కొందరు పెద్దలడుగుతారు. వెంటనే "పాకశాల" అధిష్ఠాన వర్గం ప్రత్యేక సమావేశం జరుగుతుంది. "అసలు ఆపరిషత్తులో బహుమతి నిర్ణేతలెవరు? వారి అభిరుచులేమిటి? వారివారి శ్రీమతుల అభిరుచులెలా ఉంటాయి? వారి పక్క-వారి అభిరుచ్యాదులేమిటి?" ఇటువంటి విషయాలన్నీ కూలంకషంగా చర్చించబడతాయి. తదనంతరం ఒక హేమానీ, ఒక హేమినీ, పిలిచి స్పెషల్ పురస్కారయింపు గురించి చెప్తారు. కతిపయదినాలకు పదార్థం తయారై పోతుంది. అనుకున్నట్లుగానే బహుమతి కొట్టేస్తుంది ఆ రచన.

"పాకశాల"లో ఇంకా కొద్దిమంది చేయితిరిగిన రచయితలకూ, రచయిత్రులకూ స్థానం వుందని వార్త. ఆసక్తి వున్నవాళ్ళు కార్యకర్తలను కలుసుకోవడం మంచిది. ముందుగా ఒక దరఖాస్తుముక్క పారేసిం తరువాత కలుసుకోవడం, మరీమంచిది. వారికి దరఖాస్తు అందటమూ, సరిగ్గా ఆ క్షణంలోనే ముఖాముఖి కలుసుకోవటమూ, ఒకే సారి జరిగేలా 'టైం' వేసుకోవటం, అంతకన్నా మంచిది!